ప్రజాశక్తి

గురువారం 31 అక్టోబర్ 2024

5

పార్వతీపురం మన్యం

పిఎంఇజిపిని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరూ ప్రధానమంత్రి ఉపాధికల్పన కార్యక్రమాన్ని (పిఎంఇజిపి) సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పిఎంఇజిపి పథకం కింద మంజూరైన మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారు తాళాలను లబ్ధిదారుడు మీసాల రాహుల్‌కు కలెక్టర్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎం.ఆర్.టూర్స్ అండ్ ట్రావెల్స్ పేరిట లబ్దిదారుడు మీసాల రాహుల్ పొందిన కారు ఖరీదు రూ.9,11,488 కాగా, లబ్దిదారుడు రూ.51,488 మాత్రమే భరించాల్సి ఉంటుందన్నారు. ఇందులో రూ.3,19,021 కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని, మిగిలిన పైకాన్ని బ్యాంకు రుణంగా మంజూరు చేసిందని తెలిపారు. పిఎంఇజిపి పథకంతో లబ్ధిదారుడు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం.. గిరిజన రైతాంగ పోరాటం

- అమరవీరుల త్యాగఫలమే నేటి గిరిజనాభివృద్ధి
- నేడు కోరన్న, మంగన్న 57వ వర్ధంతి
- మామిడిమానుగూడలో సభ

భూమి కోసం, భుక్తి కోసం ఈ ప్రాంతంలో ప్రతి దిక్కూ నినదిస్తోంది. ఆ నినాదాలకు పేరు పెడితే.. ఆ నాటి త్యాగాలను స్మరిస్తే.. అప్పుడు జాలువారిన కన్నీటిని, చిందించిన నెత్తుటిని గుర్తిస్తే.. మొత్తంగా ఆ అలజడికి అక్షర రూపం ఇస్తే.. అదే గిరిజన రైతాంగ పోరాటం!! సిక్కోలులో 1960వ దశకంలో దిక్కులు పిక్కటిల్లేలా నేటికి సరిగ్గా 57 ఏళ్ల క్రితం ఇదే రోజున శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. ఆ ఉద్యమం విస్తృతమైంది.. క్రమంగా గిరిజనులకు పలు హక్కులు సంక్రమించాయి. గురువారం కోరన్న, మంగన్న 57వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

మామిడిమానుగూడ గ్రామంలో అమర వీరుల స్థూపం

ప్రజాశక్తి - కురుపాం

వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం... దున్నేవాడిదే భూమి అనే నినాదంతో భూస్వాములకు వ్యతిరేకంగా 1967 అక్టోబర్ 31న కమ్యూనిస్టు పార్టీ మొండెంఖల్ గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఈ సభకు విద్యార్థులు, మహిళలు, గిరిజనులు పిల్లాపాపలతో సభకు వెళ్తున్నారు. ఈ బహిరంగ సభను భగ్నం చేయాలని పలువురు భూస్వాములు పి.లేవిడి గ్రామం వద్ద ఆదివాసీలపై దాడులు చేశారు. ఆనాటి భూస్వాముల కాల్పుల్లో ఇద్దరు ఆదివాసీ యువకులు మరణించారు. వారే శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తొలి అమరవీరులు ఆరిక కోరన్న, కొండగొర్రె మంగన్న.

విజయనగరం జిల్లాలోని కొంత ప్రాంతం ఆనాటి శ్రీకాకుళం జిల్లాలో ఉండేది. ఇందులో అధిక శాతం భూమి జమీందారులు, సంస్థానాధీశుల ఆధీనంలో ఉండేది. ఆదివాసీలకు అక్షర జ్ఞానం లేక అంకెలు తెలియకపోవడంతో భూస్వాముల దోపిడీకి వరంగా మారింది. భూస్వాముల వెట్టిచాకిరి నుంచి గిరిజనులకు విముక్తి కల్పించడానికి పలు పోరాటాలు జరిగాయి. గిరిజనులను చైతన్య పరచడానికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఏర్పాటు చేసి ఉద్యమాలకు ఊపిరి పోశారు. పల్లెరక రాములు, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం తదితరులు ముందుండి ఉద్యమాలను నడిపించారు. 1971 వరకు వివిధ దశల్లో ఉద్యమాలు జరిగాయి. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోలీసు తూటాలకు బలైపోయారు. ఆరిక గుంపస్వామి, కొండగొర్రె లచ్చన్న, కృష్ణమూర్తి, శ్రీరాములు, వసంత, రఘు, రాములు తదితరులు జైలుపాలయ్యారు. ఆనాటి ఉద్యమకారుల త్యాగ ఫలంగానే ఐటిడిఎ, జిసిసి ఏర్పాటయ్యాయి. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం వచ్చింది.

హక్కులను కాలరాసేందుకు కుట్ర

పోరాట ఫలితంగా గిరిజనులు సాధించుకున్న హక్కులను నేటి పాలకులు కాల రాయడానికి కుట్రలు చేస్తూనే ఉన్నారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి అడవి తల్లి ఒడిలో బతుకుతున్న గిరిజనులను అక్కడి నుంచి వెళ్ల గొట్టేందుకు కుట్రలు పన్నింది. ఏజెన్సీలో ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అందులో భాగంగానే గిరిజన, రైతులకు జీవనాధారమైన బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు పాలకులు అనుమతులిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ నంబర్ 3ను రద్దు చేశారు. ఇలా ఎన్నో నిర్ణయాలను ఆదివాసీలకు వ్యతిరేకంగా చేశారు. వీటిపై సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పోరాటాలు చేసి ఆ ప్రయత్నాలను కొంతమేర అడ్డుకున్నారు. యుపిఎ హయాంలో వామపక్షాల చొరవతో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని నీరుగార్చే చర్యలకు ఒడిగట్టింది. అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులకు భూములపై హక్కులు లేకుండా చేయాలని చూస్తోంది.

నేడు మామిడిమానుగూడలో కోరన్న, మంగన్న వర్ధంతి సభ

నీలకంఠాపురం పంచాయతీ మామిడిమానుగూడలో గురువారం శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట అమర వీరుల కోరన్న, మంగన్న 57వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు హాజరవుతారని తెలిపారు. గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

చంద్రబాబుకు వరద బాధితుల సహాయం కోసం చెక్కును అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు (ఫైల్)

ఇన్‌ఛార్జి మంత్రిని మార్చండి

- ముఖ్యమంత్రిని కోరిన మంత్రి, ఎమ్మెల్యేలు?
- కుదరదని స్పష్టంచేసిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా సీనియర్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వద్దని జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలంతా సిఎం చంద్రబాబునాయుడును కోరినట్లు తెలిసింది. ఈ మేరకు కొద్దిరోజుల క్రితం సిఎంను వారంతా కలిసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను ప్రభుత్వం నియమించింది. దీనిలో భాగంగా సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడును కోనసీమ, పార్వతీపురం మన్యం జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు చంద్రబాబును కలిసి కలిసి ఇన్‌ఛార్జి మంత్రిగా ఇంకొకరిని నియమించాలని, కోరినట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. అయితే దీనికి సిఎం చంద్రబాబు ససేమిరా అనడంతో వారు మిన్నకుండిపోయినట్లు తెలిసింది. సాలూరుకు చెందిన ప్రాణదాత ట్రస్ట్ సభ్యులు ఇచ్చిన లక్ష రూపాయల వరద బాధితుల విరాళాన్ని సిఎంకి అందజేశారు. ఆ నేపథ్యంలోనే ఎమ్మెల్యేలంతా చంద్రబాబు వద్ద ఈ విషయం ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే జిల్లా పార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలపై దృష్టి సారించి ఏకతాటిపై నడిపించే ఉద్దేశంతో సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడును ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది. నెలాఖరులోగా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నట్లు అధికార పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

అన్న క్యాంటీన్‌కు రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేష్ రూ.10 వేలు విరాళం అందించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి ఆధ్వర్యాన ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గన్నేష్‌ని ఎమ్మెల్యే అభినందించారు.

విరాళాన్ని అందిస్తున్న వైస్ చైర్మన్ గున్నేష్

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని
విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-మక్కువ

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఇతర విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం విద్యార్థులు ధర్నా చేశారు. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పండు మాట్లాడుతూ విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఎఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని, సంక్షేమ హాస్టల్లో వార్డెన్లను, వర్కర్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు రూ.3 వేలకు పెంచాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జి.సింహాద్రి, జి.సంజీవ్, రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టుకెళ్తే అభివృద్ధి ఆగిపోద్ది

పనులు అడ్డుకున్నా, అధికారులను బెదిరించినా ఊరుకోం : మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-మక్కువ

ఎవరో రెచ్చగొడుతున్నారని సర్పంచులు కోర్టుకు వెళ్లి పనులను అడ్డుకోవాలని చూస్తే అభివృద్ధి ఆగిపోతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. అధికారులను బెదిరిస్తూ అభివృద్ధి పనులకు అడ్డు తగిలితే చూస్తూ ఊరుకోబోమని వైసిపి నేతలు, సర్పంచులను పరోక్షంగా హెచ్చరించారు. బుధవారం మండలంలో శంబర గ్రామంలో రూ.2.41 కోట్లతో చేపట్టే ఆరు రోడ్ల పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం సావిడివీధిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వైసిపి నాయకత్వం జీర్ణించుకోలేకపోతుందని విమర్శించారు. వందర్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది గత ప్రభుత్వమేనని, ఇప్పుడు వారు దాన్ని తప్పుపడుతూ పనులకు ఆటంకాలు కల్పిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, సర్పంచ్ సింహాచలమమ్మ, టిడిపి మండల అధ్యక్షులు జి.వేణుగోపాల్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పిలిచినట్టే పిలిచి... ఆహ్వానం మరిచి

టిడిపిలో ఇంకా ఎడమొహం, పెడ మొహం జాడ్యం పోలేదన్నది శంబర కార్యక్రమంలో తేటతెల్లమైంది. పెద్దఎత్తున శంకుస్థాపన కార్యక్రమాలు ఉన్నాయంటూ మండలమంతా నాయకత్వానికి కబుర్లు పంపారు. శంకుస్థాపన అనంతరం వేదిక వద్దకు కొంతమందిని ఆహ్వానించకపోవడం గమనార్హం. పేరు పెట్టి పిలవకుండా మక్కువ నాయకులు వేదిక ముందుకు రావాలని పిలవడం ఇక్కడ గమ్మత్తుగా మారింది. అధ్యక్షుడికి నచ్చిన వారి పేరు పిలవడం వల్ల స్టేజ్ వరకు వచ్చి కొంతమంది కిందనే ఉండియారు. సీనియర్ నాయకులు మావూడి ప్రసాద రామ్ నాయుడు మాత్రం వెనుతిరిగి వెళ్లిపోయారు.

వెంగళరాయసాగర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

మత్స్యసంపద వృద్ధి చెందాలి

జిల్లాలోని మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మత్స్య సంపద వృద్ధి చెందాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాంక్షించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా వెంగళరాయ జలాశయంలో చేప పిల్లలను వదిలే కార్యక్రమం మత్స్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. విజయనగరం ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నుంచి తెచ్చిన మూడు లక్షల చేప పిల్లలను జలాశయంలోకి మంత్రి వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు చేపల పెంపకంపై మరింత దృష్టి సారించాలని కోరారు. మత్స్య సంపదతో వారికి ఉపాధి అవకాశాలే కాకుండా ఆర్థికంగా ఎదిగేందుకు దోహద పడుతుందని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. ఎస్‌టి జీవనోపాధికి అవసరమైన వేట పరికరాలు, వలలు, బోట్లు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు వంటి వాటిని పార్వతీపురం ఐటిడిఎ నుంచి మంజూరుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా మత్స్యశాఖ డిడి ఎన్.నిర్మలా కుమారి, పార్వతీపురం జిల్లా మత్స్యశాఖాధికారి వేముల తిరుపతయ్య, సాలూరు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఎల్లేటి శ్రీదేవి, శంభర ఎంపిటిసి తియ్యాల పోలినాయుడు, మాజీ సర్పంచ్ అక్యాన తిరుపతి రావు, అన్నంరాజువలస సర్పంచ్ చీమల రాములమ్మ, ఉమ్మడి విజయనగరం జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు బర్రి చిన అప్పన్న, చినచీపురువలస మత్స్య సహకార సంఘం అధ్యక్షులు సురపాటి ఆదినారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ఏనుగుల తిష్ట

పనులకు వెళ్లేందుకు భయపడుతున్న రైతులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి పొలాల్లో ఏనుగుల గుంపు స్వైరవిహారం చేస్తోంది. నాలుగు వారాల క్రితం మండలంలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు పెదబొండపల్లి, సూడిగం, పుట్టూరు, పులుగుమ్మి ప్రాంతాల్లో సంచరిస్తోంది. వరిపంట పొలాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయి. ఇప్పటికే ఏనుగుల దాడిలో వృద్ధుడు యాకోబు మరణించిన విషయం తెలిసిందే. అటవీ శాఖకు చెందిన ఏనుగుల నియంత్రణ రేంజర్ మణికంఠ ఆధ్వర్యంలో ట్రాకర్లు పగలు, రాత్రి కంటిమీద కునుకు లేకుండా వాటి కదలికలను కనిపెడుతున్నా, ఏనుగులను నియంత్రించ లేకపోతున్నారు. ఏనుగుల సంచారంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. రాత్రిపూట ఏ గ్రామంలోకి ఏనుగులు ప్రవేశించి ఏ దారుణానికి పాల్పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విశాఖపట్నానికి చెందిన ఫారెస్ట్ కన్జర్వేటర్ మదీనా తన బృందంతో బుధవారం మండలంలో పర్యటించి, ఏనుగుల కదలికలను పరిశీలించారు. ఇక్కడి పరిస్థితిపై నివేదికను రాష్ట్రస్థాయి అధికారులకు పంపిస్తామని తెలిపారు.

వరిపొలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఏనుగులను తక్షణమే తరలించాలి

ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఏనుగుల గుంపును తక్షణమే తరలించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.మోహనరావు.. ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏనుగుల సంచారంతో ప్రాణ, ఆస్తినష్టం సంభవిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే ఏనుగులను వేరే ప్రాంతాలకు తరలించాలని కోరారు. లేదంటే ప్రజలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని బతకాలని ఆవేదన వ్యక్తంచేశారు. పొలం పనులకు వెళ్లే వారు తిరిగి ఇంటికి రాలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు టి.గౌరీశంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు పట్ల సింగు రవికుమార్, చింతాడ నారాయణరావు , ముద్దాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ తరహాలో అపార్

త్వరితగతిన విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి : కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఆధార్ తరహాలో ఉండే అపార్ కార్డులను విద్యార్థులకు జారీ చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశి ంచారు. అపార్ నంబర్‌తో విద్యార్థి చరిత్ర మొత్తం తెలిసిపోతుందని, విద్యార్థుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని కలెక్టర్ చెప్పారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్ నేషన్- వన్ ఐడి పేరుతో 17 అంకెలుండే ఈ కార్డులు ఇచ్చేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లోని విద్యార్థులకు ఇప్పటికే ప్రయోగాత్మకంగా కార్డులను అందించిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. మన రాష్టంలో కూడా కార్డులను జారీచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దీనికోసం తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల పూర్తి వివరాలు సేకరించి, అపార్‌లో నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ఈ విషయమై ఇప్పటికే ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇంతవరకు కొందరు మాత్రమే చేశారని, మిగిలిన వారు కూడా త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఈ కార్డు జారీ చేయనున్న నేపథ్యంలో అందరి వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ తేల్చిచెప్పారు.

అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యతను సంబంధిత జిల్లా, మండల విద్యాశాఖాధికారులు ప్రతి రోజూ పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతి నాయుడు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - కురుపాం

నీలకంఠాపురం పంచాయతీ దండుసురగూడ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు అధికారులను కోరారు. బుధవారం ఆ గ్రామాన్ని సిపిఎం నాయకులు మూటక న్నరు, పి.బంగారయ్య, కొండగొర్రి శ్రీరాంలతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 200 కుటుంబాలు నివసిస్తున్న గిరిజన గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన ఒక్క వాటర్ ట్యాంకు సరిపోవడం లేదన్నారు. గిరిజనులు సొంత డబ్బులతో బోరు వేసి, నీటి ట్యాంకు ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. అయినా నీరు చాలడం లేదని, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి బోరు వేసి తాగునీటి ట్యాంకును నిర్మించి, నీరందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, బాబి, బిడ్డిక సింహాద్రి, మండంగి వెంకట్రావు, కడయి ఉన్న తదితరులు పాల్గొన్నారు.

సరిపడా నీరు అందించని తాగునీటి ట్యాంకును చూపిస్తున్న ఈశ్వరరావు, గిరిజనులు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

దొంగ పట్టాలతో అడ్డగోలు కట్టడాలు ● చోద్యం చూస్తోన్న రెవిన్యూ, మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీ పరిధిలోని బంగారమ్మకాలనీలో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ సిబ్బంది వారించినా ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పట్టణ తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్ వెళుతున్న ప్రదేశానికి ఇరువైపులా సర్వే నంబర్ 206/2లో ఉన్న సుమారు 70 సెంట్ల స్థలాన్ని పట్టణ అవసరాల కోసం కేటాయించారు. ఈ స్థలంలో 50 శాతం వరకు ఆక్రమణకు గురైంది. దీనిలో పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు

గతంలో ఇదే స్థలంలో కొంతమంది రాజకీయ పలుకుబడితో ఇళ్లు నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తే అధికారులు అడ్డుకున్నారు. అది ప్రభుత్వ స్థలమని బోర్డు కూడా పెట్టారు. అయితే ఆ బోర్డును ఆక్రమణదారులు తొలగించి మళ్లీ నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. దీనిపై కొంతమంది గత వైసిపి ప్రభుత్వం హయాంలో కన్ను వేసి కబ్జా చేయాలని ప్రయత్నించగా, అప్పటి డిప్యూటీ సిఎం రాజన్నదొర వారించడంతో ఆగిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది ఆ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే పైపులైన్ వెనుక స్థలంలో కాకులతోటకు వెళ్లే రహదారి పక్కన ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు.

గతంలో ఈ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి కొంతమేర బిల్లు కూడా మంజూరైంది. కాలనీకి చెందిన ఓ బడాబాబు ఈ స్థలాన్ని విక్రయించినట్లు ఇంటి నిర్మాణదారు విలేకరులకు చెప్పారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం పని చేసిన తహశీల్దార్ సంతకాలతో దొంగ ఇంటి పట్టాలు తీసుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై తహశీల్దార్ ఎస్వి రమణని వివరణ కోరగా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్పొరేషన్ స్థాయికి పార్వతీపురాన్ని అభివృద్ధి చేద్దాం

ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పార్వతీపురం మున్సిపాలిటీని కార్పొరేషన్ దిశగా అభివృద్ధి చేసేందుకు అందరం కలిసి కృషి చేద్దామని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలోని 8, టేబుల్ అజెండాలో పొందుపరిచిన 5 అంశాలను సభ్యులు ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభ్యంతరాలు ఉంటే చెప్పాలని, వార్డు సమస్యలు ఏమైనా ఉంటే ప్రస్తావించాలని కోరారు. వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లలో జరిగిన సమావేశాలలో అన్ని అజెండాలలో అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించినా, పనులు చేపట్టలేదని తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 27వ వార్డులో ఒక్క పనీ చేయలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. పట్టణంలో ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ చాలా అధ్వానంగా ఉందని ప్రస్తావించారు. 25, 29 వార్డు కౌన్సిలర్లు సుధీర్, త్రినాథ మాట్లాడుతూ తమ వార్డుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, పైపులైన్ వేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలో ఎఐఐబి ద్వారా పట్టణ ప్రజలకు నిరంతరం తాగునీరు సరఫరా చేసేందుకు వచ్చిన ప్రాజెక్టును మళ్లీ రెన్యువల్ చేసినట్లు తెలిపారు. జనవరి తర్వాత ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని చెప్పారు. తోటపల్లితోపాటు జంఝావతి రిజర్వాయర్ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రూ.4కోట్లతో ప్రధాన రహదారులకు త్వరలో మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, కమిషనర్ శ్రీనివాసరాజు, మేనేజర్ జి.లక్ష్మి, టిపిఒ ప్రమీలరాణి, ఎఇలు సన్యాసిరావు, అప్పారావు, రెవెన్యూ అధికారి రూబెన్ దిబ్బ, శానిటరీ ఇన్స్పెక్టర్ పకీరురాజు, ఆర్ఐలు ఈశ్వరరావు, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేష్

వైసిపికి షాక్

పట్టణంలో వైసిపికి గట్టి షాక్ తగిలింది. బుధవారం వైసిపి కౌన్సిలర్లు ఐదుగురు టిడిపిలో గూటికి చేరారు. వైసిపి కౌన్సిలర్లు బొత్స ఆనంద (7వ వార్డు), పొట్నూరు జయంతి (9వ వార్డు), జలుమూరు దివ్య (10వ వార్డు), వారణాసి కళ్యాణి (11వ వార్డు), తాడ్డి అరుణ (12వ వార్డు)కు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జీడి పరిశ్రమ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

జీడి పరిశ్రమను ఏజెన్సీలో ఏర్పాటుచేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అంటివలసలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కొమరాడ మండలంలో 75 గిరిజన గ్రామాలు ఉండగా అందులో కేవలం 9 గ్రామాలకు మాత్రమే జీడిమొక్కల కత్తిరింపు పథకాన్ని అమలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీడి పిక్కల ఫ్యాక్టరీ ప్రారంభించాలని వినతి అందించినా నేటికీ అతీగతీ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, బోడయ్య, రైతులు సింహాచలం, శంకరి, రంగారావు, ఎరకయ్య పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో భరోసా

కురుపాం : టిడిపి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సభ్యత్వ నమోదుతో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ తెలిపారు. బుధవారం కురుపాం కోటలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, జి.వి. రమణమూర్తి, రంజిత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రపురం గ్రామస్తుల వినతి

మహేంద్రపురం గ్రామస్తులు ఎమ్మెల్యే టి.జగదీశ్వరిని కలిసి, గ్రామ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ప్రధాన రహదారి నుండి గ్రామానికి 450 మీటర్లు బిటి రోడ్డు, మధ్యలో వాగు వద్ద స్లాబ్ కల్వర్టు ఏర్పాటుచేయాలని, కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని విన్నవించారు. వారి వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న మహేంద్రపురం గ్రామస్తులు

ప్రతిభా పాఠశాలలో సోషల్ టీచర్‌ను నియమించాలి

పార్వతీపురం : గిరిజన ప్రతిభా పాఠశాలలో రెండేళ్లుగా సోషల్ టీచర్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో చెప్పారు. గురుకులం సొసైటీ అధికారులు వెంటనే సోషల్ టీచర్‌ని నియమించాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

కొమరాడ : ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నీలకంఠం కోరారు. బుధవారం మండలంలోని గుమడ గ్రామంలో సివిల్ రైట్స్, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఒటిపి, ఎటిఎం కార్డు వివరాలు అడిగితే చెప్పొద్దని సూచించారు. తక్కువ నగదు పెట్టుబడి పెడితే ఎక్కువ నగదు ఇస్తామని ఆశ చెప్పి ఆన్‌లైన్‌లో కేటుగాళ్లు మోసం చేసి ప్రజలను నట్టేట ముంచుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

సీతానగరం: మండలంలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఎంపిడిఒ త్రివిక్రమరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి మార్చి నాటికి పనులు పూర్తిచేయాలని కోరారు. పెదబోగిలి-1 సచివాలయ పరిధిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ విజేతకు అభినందన

పార్వతీపురంరూరల్ : విజయనగరంలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన పార్వతీపురం పట్టణానికి చెందిన యువకుడు కిశోర్‌ను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బుధవారం అభినందించారు. కిశోర్‌ను ఆదర్శంగా తీసుకొని, నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపాలని ఆయన కోరారు.

అంగన్వాడీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

అంగన్వాడీ కుటుంబానికి పరామర్శ

సాలూరు రూరల్ : మండలంలోని కరాసువలస పంచాయతీ దత్తివలసలో గుండెపోటుతో మరణించిన అంగన్వాడీ కార్యకర్త బొమ్మి బంగారమ్మ కుటుంబాన్ని మంత్రి సంధ్యారాణి, మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర వేర్వేరుగా పరామర్శించారు.

17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

వీరఘట్టం : మండలంలో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నవంబర్ రెండో వారం నుంచి కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ఎఒ జె.సౌజన్య తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో ఎఒ మాట్లాడారు. మండలంలో పిఎం కిసాన్ రుణం పొందని రైతులు అందుబాటులో ఉన్న గ్రామీణ వ్యవసాయ సహాయకులకు ఫిర్యాదు చేయాలని కోరారు. మండలంలో 10,353 ఎకరాల్లో వరి సాగు చేయగా, 15,800 మందికి ఇ-క్రాప్ చేసినట్టు చెప్పారు.

9756 మందికి పింఛన్లు

వీరఘట్టం : మండలంలో నవంబరు ఒకటో తేదిన 9756 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 177 మంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

పౌర హక్కులపై అవగాహన

పార్వతీపురం రూరల్ : మండలంలోని సూడిగం పంచాయతీ మూడడ్లవలస గ్రామంలో బుధవారం పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషి కుమారి పౌర హక్కులపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని గ్రామస్తులను కోరారు.

నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి-కొమరాడ

ఎఒబి సరిహద్దు ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను పట్టుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. కూనేరు చెక్‌పోస్ట్ వద్ద ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తుండగా పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని, నాటు సారాను విడిచిపెట్టి పరారయ్యాడు. ద్విచక్ర వాహనాన్ని, 80 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తి బదలాయింపు పన్ను తగ్గింపు

వారసత్వ ఆస్తికి 0.1 శాతం, క్రయవిక్రయాలపై 0.5 శాతం విధింపు ● ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన పేర్లు మార్పునకు చెల్లించాల్సిన రుసుములను తగ్గిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. బుధవారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశం అజెండాలో ఉన్న అంశాలను ఆమోదించారు. ఏడాది క్రితం ఈ రుసుములను ఒక శాతానికి పెంచుతూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆమోదం తెలిపిన తర్వాత కొంతమంది కౌన్సిలర్లు దీనిపై పునరాలోచనలో పడ్డారు. పట్టణ ప్రజల నుంచి కూడా కొంత వ్యతిరేకత వచ్చింది. దీంతోపాటు సాలూరు కంటే పెద్ద మున్సిపాలిటీలైన పార్వతీపురం, బొబ్బిలిలో 0.5 శాతం రుసుం వసూలు చేస్తుంటే ఇక్కడ ఒక శాతం వసూలు చేయడం సరైన నిర్ణయం కాదని ఆలోచించారు. దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందని కౌన్సిలర్లు భావించారు. దీంతో బుధవారం జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ సహకరించిన కమిషనర్ సత్యనారాయణని అభినందించారు. వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల బదలాయింపునకు 0.1 శాతం, క్రయవిక్రయాల ద్వారా సంక్రమించిన ఆస్తులకు 0.5 శాతం రుసుం విధించాలని నిర్ణయించారు.

పారిశుధ్య నిర్వహణకు సంబంధించి కొనుగోలు చేసిన జెసిబి, కాంపాక్టు యంత్రాలను నడిపేందుకు డ్రైవర్లను ఎందుకు నియమించలేదని కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, గిరి రఘు ప్రశ్నించారు. సుమారు రూ.50 లక్షలతో కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయని, వెంటనే సిబ్బంది నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. కమిషనర్ సత్యనారాయణ స్పందిస్తూ దీనిపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని, అనుమతి లభిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలోని కళ్యాణ మండపాలలో వివాహాలు నిర్వహించిన సందర్భంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను వెంటనే తరలించడం లేదని, రెండు మూడు రోజులు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. దీనిపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ మాట్లాడుతూ వెంటనే వ్యర్థ పదార్థాలను తరలిస్తామని చెప్పారు. వాటర్ వర్క్స్ వద్ద పాడైన మోటార్‌కి బదులు కొత్త మోటార్ కొనుగోలు చేసేటప్పుడు సరైన గ్యారెంటీ ఉన్నవి కొనాలని, మే నెలలో శ్యామలాంబ పండుగ ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గిరి రఘు, గొర్లి వెంకటరమణ కోరారు.

దీనిపై మున్సిపల్ డిఇ బివి ప్రసాద్ మాట్లాడుతూ గ్యారెంటీ ఉన్న మోటార్‌నే కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు జర్జాపు నీలిమ, బీషపు హైమవతి, వైదేహి కృష్ణారావు, ముసిడిపిల్లి సరోజిని, సింగారపు ఈశ్వరరావు, వరప్రసాద్, జి.నాగేశ్వరరావు, వైసిపి ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ శ్రీనివాసరావు

కోరన్న, మంగన్న స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కోరన్న, మంగన్న పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దంతులూరి వర్మ అన్నారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట అమరవీరులు కోరన్న, మంగన్న 57వ వర్ధంతి సభను మండలంలోని సీతంపేట గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో వర్మ మాట్లాడారు. పోరాట ఫలితంగానే గిరిజనులు ఏజెన్సీలో అనేక హక్కులు పొందారని తెలిపారు. 360 మంది బలిదానాల తర్వాత ప్రభుత్వం1/70 చట్టాన్ని తెచ్చిందని, గిరిజనుల అభ్యున్నతి కోసం ఐటిడిఎలను, జిసిసిలను ఏర్పాటుచేసిందని చెప్పారు. 1/70 చట్టం పూర్తిగా అమలు కాలేదని, ఇంకా 270 గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంగా ప్రకటించాలని తెలిపారు. దీనికోసం గిరిజన ప్రజానీకం అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిఒ 3ని అమలు చేసి విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బడిదేవరకొండ గ్రానైట్ లీజులను రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. ఏనుగుల సమస్య పరిష్కరించాలన్నారు. సభలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, పి.శ్రీనునాయుడు, వెంకటస్వామి, హిమరక మిన్నరావు, పీడక ఆశిరి, ఎస్.విశ్వేశ్వరరావు మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్

ఐఆర్ ప్రకటించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-సాలూరురూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్ బకాయిలు చెల్లించి, ఐఆర్ ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సాలూరులోని పెన్షనర్స్ కార్యాలయంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. అనంతరం యుటిఎఫ్ సాలూరు, పాచిపెంట మండలాల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాలూరు మండల గౌరవాధ్యక్షులుగా ఎస్.సింహాచలం, అధ్యక్షులుగా ఎ.సీతయ్య, ప్రధాన కార్యదర్శిగా అనకాపల్లి గణేష్, సహాధ్యక్షులుగా యు.తిరుపతి, సిహెచ్ లక్ష్మి, కోశాధికారిగా ఎస్.కృష్ణను ఎన్నుకున్నారు. పాచిపెంట మండల గౌరవ అధ్యక్షులుగా బి.మధుసూదనరావు, అధ్యక్షులుగా సిహెచ్ భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.గణపతి, సహాధ్యక్షులుగా ఎస్.అశోక్, ఎస్.లక్ష్మి, కోశాధికారిగా ఆర్.అప్పారావును ఎన్నుకున్నారు. అనంతరం స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక కోమటివీధి ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సమావేశాన్ని మండల అధ్యక్షులు బి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. మండల ప్రధానకార్యదర్శి కె.గోవిందరావు కార్యదర్శి రిపోర్టును, కోశాధికారి వాసుదేవరావు ఆర్థిక రిపోర్టును ప్రవేశపెట్టారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా ఎ.స్వామిబాబు, అధ్యక్షులుగా బి.దుర్గాప్రసాద్, ప్రధానకార్యదర్శిగా కె.గోవిందరావు, సహాధ్యక్షులుగా జెవి సూర్యప్రకాశ్, ఎస్.విశాలాక్షి, కోశాధికారిగా బి.వాసుదేవరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎం.పైడిరాజు, పరిశీలకులుగా కె.కృష్ణారావు వ్యవహరించారు.

4న విఆర్‌ఎల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విఆర్‌ఎల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నవంబర్ నాలుగో తేదిన చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ తెలిపారు. బుధవారం పార్వతీపురం తహశీల్దార్ జయలక్ష్మిని కలిసి వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విఆర్‌లకు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నైట్ వాచ్మెన్ డ్యూటీలు, ఇసుక, రైస్ మిల్ డ్యూటీలు నిలుపుదల యాలన్నారు. అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ ఖాళీ పోస్టులను విఆర్‌ఎల ద్వారా భర్తీ చేసి, పేస్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్లపై చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం నాయకులు జె.విజయ్‌కుమార్, ఎస్.కేశవరావు, జె.శివ, కె.నిర్మల, ఆర్.కొండలరావు, డి.రవి, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు పాల్గొన్నారు.


బలిజిపేట.. వినతి అందిస్తున్న విఆర్‌ఎలు

బలిజిపేట : విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని బలిజిపేట తహశీల్దార్ కె.రత్నకుమారికి సిఐటియు ఆధ్వర్యాన విఆర్‌ఎలు వినతి అందించారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం నాయకులు సుధా మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతభత్యాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబూరావు, శ్రీను, నక్షత్రమ్మ, రవి పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం చేపడుతున్న ఆర్‌పి నాగేశ్వరరావు

కె.గుమడలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని కె.గుమడ గ్రామంలో సామ పంటలో పంటకోత ప్రయోగాన్ని వెలుగు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంటకోత ప్రయోగం వల్ల లాభాలు, మొత్తం పంట దిగుబడిని తెలుసుకోవచ్చునని రిసోర్స్ పర్సన్ పి. నాగేశ్వరరావు తెలిపారు. ప్రకృతి, రసాయనిక వ్యవసాయ పద్ధతులకు మధ్య దిగుబడి వివరాలను నమోదు చేశారు. సామ పంట వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వసంత, ఉమ, లావణ్య పాల్గొన్నారు.

పాఠ్యాంశాలపై సంపూర్ణ విజ్ఞానం

విద్యార్థులకు సూచించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాఠ్యాంశాలపై సంపూర్ణ విజ్ఞానం కలిగి ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడమే మై స్కూల్ -మై ప్రైడ్ ఉద్దేశమని చెప్పారు. మై స్కూల్ - మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక డివిఎం పురపాలకోన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి చదివే విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. సబ్జెక్టుల వారీగా టీచర్ల కొరత లేకుండా సర్దుబాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు బోధన విషయంలో అటువంటి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు లేవని విద్యార్థులు తెలియజేయడంతో కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. పదో తరగతి చదువు అనంతరం ఉపాధి అవకాశాలు లభించే కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ పర్యటనలో మండల విద్యాశాఖాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వ్యవసాయ ల్యాబ్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పాచిపెంట

రైతులు తాము పండించిన విత్తనాల నాణ్యతను పరీక్షించుకోవడానికి ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటుచేసిన వ్యవసాయ ల్యాబ్‌ను వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు కోరారు. మండలంలోని రాయిగుడ్డివలస, సరాయివలస గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పదమైన విత్తనాలను మార్కెట్ యార్డ్ పరిధిలో ఉన్న వ్యవసాయ ల్యాబ్‌లో పరీక్షించుకోవచ్చని తెలిపారు. సర్పంచ్ సీతయ్య మాట్లాడుతూ రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల ఖర్చులు పెరగడమే కాకుండా ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంఠందొర లక్ష్మయ్య, విఎఎ సాయిగణేష్, పశుసంవర్ధక శాఖ సహాయకులు మౌనిక, ప్రకృతి సేద్యం ఎల్‌టు సూర్యారావు, ఐసిఆర్‌పి సుకర్మ, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని టి.సీతారాంపురం, గుచ్చిమి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ అవినాష్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాసరావు రైతులకు సూచనలు చేశారు. సర్పంచ్ ఎం.శ్రీదేవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట.. రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

వేలం ప్రకటన
మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP 27/18 OS 35/17

Between:
బండి చిరంజీవి ......డిక్రీ హోల్డరు
And :
పెద్దింటి తిరుపతి నాయుడు ...జడ్జిమెంటు డెటారు

పై నెంబరు అమలులో ఈ దిగువ షెడ్యూలు దాఖాలా మరియు జడ్జిమెంటు డెటారు యొక్క హక్కు అనుభవములో ఉన్నటువంటి ఆస్తిని పై కోర్టులో తే.15.11.2024ది ఉదయం గం. 10.30ని॥ లగాయితూ బహిరంగంగా వేలం వేయబడును కావునా వేలంలో పాల్గొనదలచినవారు ఇస్తియారు షరతులకు లోబడి వేలంలో పాల్గొనగలరు,

ఆస్తివివరం

విజయనగరం జిల్లా ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా, గరుగుబిల్లి మండలం, కొత్తూరు గ్రామంలో దిగువ వీధిలో యున్నటు వంటిన్ని ఇంటి నెం. 1-145గల శ్లాబు ఇల్లు తూర్పు పడమరలకు 15 అడుగులు వెడల్పున్నూ, ఉత్తర దక్షిణములకు 50 అడుగులు కలిగిన శ్లాబు ఇంటికి హద్దులు. తూర్పునకు:- నిర్మాణంలో ఉన్నటువంటి అంగన్‌వాడీ బిల్డింగ్. దక్షిణమునకు: - ద్వారపురెడ్డి బలరాం నాయుడు గారి కళ్లం. పడమరనకు: - ద్వారపురెడ్డి సోములమ్మ మరియు ద్వారపురెడ్డి చిన్నంనాయుడు గార్ల ఖాళీస్థలం. ఉత్తరమునకు: - రోడ్డు
ఈసి లెఖ్ఖ దాఖలా అన్యాక్రాంతములు లేవు.
డిక్రీ హోల్డరు విలువ రూ॥ 5,00,000/-లు
అమీను గారి విలువ రూ॥ 6,00,000/-లు
మార్కెట్ విలువ రూ॥ 6,05,831/-లు
జడ్జిమెంటు డెటారు గారి విలువ దాఖలు చేయలేదు.
కోర్టు వారి ఉత్తర్వులును అనుసరించి

పి. రాజేశ్వరరావు
డిక్రీ హోల్డరు తరపు న్యాయవాది
పార్వతీపురం
సెల్: 9440510328